క్లుప్తంగా

దైవ ప్రసన్నతతోనే ఉమ్రా యాత్ర

ఖమ్మం మామిళ్లగూడెం: దైవ ప్రసన్నత లభిస్తేనే ఉమ్రా యాత్ర సాధ్యమవుతుందని ముఫ్తీ అహ్మద్ ఇశాతి తెలిపారు. ఖమ్మం కాల్వొడ్డులోని మదర్సే ఇస్లామీయ దారుల్ ఉలుంలో వచ్చేనెల 3న మక్కా మదీనాకు బయలు దేర నున్న యాత్రికులకు బుధవారం పలు అంశాలపై అవగాహన కల్పించి ప్రయాణ బ్యాగులు, కుట్టులేని వస్త్రాలు అందించారు. ఈ సందర్భంగా ముఫ్తీ అహ్మద్ మాట్లాడగా ఎం.డీ.జవ్వాద్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనికి పరామర్శ

ఖమ్మంరూరల్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొంది హైదరాబాద్‌లోని తన నివాసంలో ఉంటుండగా బుధవారం సీపీఎం సీనియర్ నాయకులు సిద్ధినేని కోటయ్య, బత్తినేని వెంకటేశ్వరరావు, రాయల వెంకటేశ్వర్లు పరామర్శించారు. తమ్మినేని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం



సోమ్‌లాల్‌ను అభినందిస్తున్న సంఘ నేతలు

ఖమ్మంఅర్బన్: ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ సోమ్‌లాల్‌కు ప్రభుత్వం ఇటీవల పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. బుధవారం ఈమేరకు హైదరాబాద్‌లో జిల్లా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం అధ్యక్షుడు ధరావత్ రామ్మూర్తి నాయక్ ఆధ్వర్యాన సంఘం నేతలు కలిసి సన్మానించి అభినందించారు. అభినందించిన వారిలో రామ్మూర్తి నాయక్‌తో పాటు సంఘం జిల్లా నాయకులు పాల్గొన్నారు.

నియామకం

కామేపల్లి: ఐఎన్‌టీయూసీ ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్ కోశాధికారిగా మండలంలోని పండితాపురం గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ధరావత్ మాన్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఖమ్మంలోని సంజీవ్‌రెడ్డి భవన్‌లో ఐన్‌టీయూసీ ఫీల్డ్ అసిస్టెంట్ నూతన జిల్లా కమిటీ ఎన్నిక జరిగింది. ఫీల్డ్ అసిస్టెంట్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాన్‌సింగ్ తెలిపారు.

ఖాళీ పదవులు భర్తీ

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ డ్రైవర్ల సంఘంలో ఖాళీగా ఉన్న పలు పదవులను భర్తీ చేసినట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ మన్జిత్‌సింగ్ తెలిపారు. బుధవారం నగరంలోని ప్రభుత్వ డ్రైవర్ల సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా ముఖ్య సలహాదారుడిగా ఎస్‌కె.నయీమ్, జిల్లా సలహాదారుడిగా జి.రాములు, జిల్లా ఉపాధ్యక్షులుగా ఎండీ.రఫీ, అఫ్జల్ పాషా, రెండో సలహాదారుడిగా ఎం.బాబూరావులను ఎన్నుకున్నారన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈ.పద్మారావు, అసోసియేట్ అధ్యక్షుడు పంతులు శ్రీనివాస్, రాష్ట్ర కోశాధికారి సయ్యద్ హుసేన్ హుస్సేనీ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కె.నర్సింగరావు, ప్రోటోకాల్ సెక్రటరీ అలీమ్ ఖాన్‌లతో పాటు ఎస్‌కె.ఖాజామీయా, హరినాధరెడ్డి, విద్యాసాగర్, ఎండీ.అబ్దుల్ హకీమ్, తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఖమ్మం లీగల్: న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఖమ్మం జిల్లా సమితి ప్రభుత్వాన్ని కోరింది. కేంద్రంలో సీనియర్ న్యాయవాది షేక్ లతిఫ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ న్యాయవాది ఖమ్మం బారు అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పెమ్మసాని పట్టాభి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు ఇళ్ల స్థలాల కేటాయించడంతో పాటు రూ.20 లక్షలు వడ్డీలేని రుణాలు మంజూరు చేయాలని ఆయన కోరారు. అనంతరం ఐఏఎల్ జాతీయ కౌన్సిల్ సభ్యుడు ఓరుగంటి శేషగిరిరావు మాట్లాడుతూ.. జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.5 వేల భృతి అమలు చేయలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఉమామహేశ్వరరావు , జీవీ. లక్ష్మీనారాయణ, మేకల నవీన్కుమార్, రావి శివరామ కృష్ణ, తోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కామేపల్లి: ఫిబ్రవరి 4న ఖమ్మంలో జరిగే టీఎస్‌యూటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాలని టీఎస్‌యూటీఎఫ్ మండలాధ్యక్షుడు నరసింహారావు, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరస్వామి తెలిపారు. బుధవారం స్థానిక ముచ్చర్ల ప్రాథమిక పాఠశాలలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపించేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

లబ్ధిదారులకు ఐరిష్ నమోదు చేస్తున్న డీలర్ (ఫైల్)



ప'రేషన్'..!

గందరగోళంగా రేషన్ పంపిణీ తేదీలు

- 1వ తేదీ నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నా ప్రతీ నెల ఆలస్యమే...
- ఎప్పుడు ఇస్తారో తెలియక లబ్ధిదారుల ప్రదక్షిణలు
- కొత్త ప్రభుత్వంలోనైనా తీరు మార్చాలని విన్నపం

ఖమ్మం సహకారనగర్: పౌర సరఫరాల శాఖ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు రేషన్‌కార్డు లబ్ధిదారులకు అందించే బియ్యం పంపిణీపై స్పష్టత కొరవడింది. ప్రతి నెలా 1వ తేదీ నుంచి పంపిణీ చేయాల్సి ఉన్నా ఆ దిశగా పంపిణీ చేయడం లేదు. ఎప్పుడు బియ్యం పంపిణీ చేస్తారో తెలియక లబ్ధిదారులు రేషన్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఏ తేదీ నుంచి ఏ తేదీ వరకు ఇస్తారో కూడా ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. ఖమ్మం అర్బన్ మండలం(ఖమ్మం నగరం)లో 95 రేషన్ దుకాణాలు ఉండగా... వీటి పరిధిలో 64,332 కార్డులు ఉండగా... 1,85,650మంది లబ్ధిదారులున్నారు. వీరికి 11,13,900 కేజీల బియ్యాన్ని ప్రతినెలా అందజేస్తారు.

ఇంతకు ముందు ఇలా..

ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు డీలర్లు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసేవారు. ప్రతీ సోమవారం సెలవు కూడా ఉండేది. ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి డీలర్లకు సెలవులు లేకపోగా... ఏ నెలలో ఏ రోజు నుంచి పంపిణీ ప్రారంభమై ఏ రోజుతో ముగుస్తుందో కూడా తెలియని పరిస్థితి ఉంది.

ఒక్కో నెలలో ఒక్కో రకంగా..

గత ప్రభుత్వం సుమారు మూడేళ్లుగా రేషన్ పంపిణీ తేదీలు గందరగోళంగా చేస్తుండగా... కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా గతంలో మాదిరిగా 1 నుంచి 15వ తేదీ వరకు ఉదయం , సాయంత్రం వేళల్లో పంపిణీ చేసేలా చూడాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఒక్కో నెలలో ఒక్కోరకంగా పంపిణీ చేయడం మూలంగా ఎదురుచూడాల్సి వస్తుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తర్వులు రాలేదు..

ఫిబ్రవరిలో రేషన్ బియ్యం పంపిణీపై ఇప్పటి వరకు మా శాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. ఉత్తర్వులు అందగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం. రేషన్ దుకాణాలకు బియ్యం సరఫరా జరుగుతుంది.

– నిస్సార్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్, ఖమ్మం అర్బన్

పంపిణీపై స్పష్టత ఉండాలి..



రేషన్ బియ్యం పంపిణీపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన పంపిణీ తేదీ లేకపోవడం వల్ల లబ్ధిదారులకు తేదీని చెప్పలేక పోతున్నాం. పౌర సరఫరాల శాఖాధికారులు ఒక్కో నెలలో ఒక్కో రకంగా తేదీలను ప్రకటిస్తున్నారు. అలా కాకుండా ప్రభుత్వం స్పష్టమైన తేదీలు ప్రకటిస్తే ఆయా తేదీల్లోనే లబ్ధిదారులు బియ్యం తీసుకెళ్లే అవకాశం ఉంటుంది.

– జానిమియా, రేషన్ డీలర్, ఖమ్మం

సకాలంలో సరఫరా చేయాలి



రాష్ట్ర ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే బియ్యాన్ని ప్రతీ నెల సకాలంలో అందించాలి. ఒక్కో నెలలో ఒక్కో రకంగా ఇస్తుండడంతో ఏ నెలలో ఎప్పుడు పంపిణీ జరుగుతుందో కూడా తెలియడం లేదు. అనేక మంది లబ్ధిదారులు దుకాణాల చుట్టు తిరగాల్సి వస్తుంది. ఈ సమస్యను పరిష్కరించాలి.

– కె.లక్ష్మి, ఖమ్మం

స్పష్టత కరువు..

లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీలో స్పష్టత కరువైంది. సుమారు మూడేళ్లుగా ఎప్పటి నుంచి ఎప్పటి వరకు పంపిణీ జరుగుతుందో డీలర్లకు సైతం తెలియడం లేదు. కనీసం బియ్యం కోసం దుకాణం వద్దకు వచ్చే లబ్ధిదారులకు డీలర్లు ఎప్పుడిచ్చేదో చెప్పలేని పరిస్థితి నెలకొంది. గత నాలుగు నెలలుగా ఇలాగే జరగడం గమనార్హం. ఈ నెలకు సంబంధించిన పంపిణీపై ఇప్పటి వరకు అధికార యంత్రాంగానికి ఎలాంటి ఉత్తర్వులు అందలేదు. కాగా, డిసెంబర్‌లో 5 నుంచి 20వ తేదీ వరకు, జనవరిలో 8వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పంపిణీ చేశారు. కాని ఫిబ్రవరిలో ఎప్పుడు పంపిణీ ప్రారంభించాలో కూడా అధికార యంత్రాంగం తెలియజేయలేదు.

ఓటింగ్ శాతం పెంచేందుకు కృషి

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గంలో ఓటింగ్ శాతం మరింత పెంచేందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలని కేఎంసీ కమిషనర్, ఖమ్మం-112 ఆర్‌ఓ ఆదర్శ్ సురభి అన్నారు. బుధవారం కేఎంసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫామ్ 6, 7, 8 లకు సంబంధించిన వివరాలను తెలపడంతో పాటు ఎమ్మెల్సీ షెడ్యూల్, స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 గురించి తెలిపారు. గత ఎన్నికల్లో ఖమ్మంలో ఎక్కడెక్కడ పోలింగ్ శాతం తగ్గిందనే వివరాలను పోలింగ్ కేంద్రాల వారీగా వివరించారు.



మాట్లాడుతున్న కమిషనర్ ఆదర్శ్ సురభి

టీడీపీ నాయకుల వినతి ..

ఖమ్మంఅర్బన్: నగరంలో నానాటికీ పెరుగుతున్న రద్దీ మూలంగా పాదచారులకు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్లలో ఫుట్ ఫ్లై ఓవర్ వంతెనలను నిర్మించాలని నగర మున్సిపల్ కమిషనర్‌కు బుధవారం తెలుగు దేశం పార్టీ నాయకులు వినతి పత్రం అందించారు. ఎన్‌టీఆర్ సర్కిల్‌లో కొత్త ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగితే ఇల్లెందు, వైరాకు వెళ్లె వాహనాలతో రద్దీ సమస్య తగ్గుతుందని, అలాగే మయూరిసెంటర్, కాల్వొడ్డు బైపాస్, జెడ్పీసెంటర్ తదితర కూడళ్లలో కాలినడక వెళ్లేవారికోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని వినతిలో కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండబాల కరుణాకర్, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి నాగార్జున శ్రీనివాస్, తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రధినిధి చుండూరు రాజరాజేశ్వరిలతో పాటు గడిపూడి వెంకటేశ్వరరావు, పాలడుగు కృష్ణప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఖమ్మంరూరల్: గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కొండం కరుణాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గోళ్లపాడులోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాటి, ఈత చెట్లను నరకకుండా చూడాలని, ప్రమాదవశాత్తూ చనిపోతే రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని,ప్రమాదాల నివారణకు సేఫ్టీ మోకులను అందించడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సంఘం క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు గడ్డమీది వెంకటేశ్వర్లు, బోనెపల్లి సంగయ్య, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు, గుండు రమేశ్, శ్రీను, తొండ రవి, పిరికపల్లి సుదర్శన్, తాళ్లపల్లి సత్యనారాయణ, మొక్క కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'ఆర్జేసీ'లో అవగాహన..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఆర్జేసీ డిగ్రీ కళాశాలలో బుధవారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సైబర్ క్రైమ్ ఎస్‌ఐ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ.. యువత సోషల్ మీడియా పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ నేరాలకు గురైతే 1930 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అనంతరం ఎస్‌ఐను కళాశాల ప్రిన్సిపాల్ ఎ.లింగయ్య, ఇన్‌చార్జ్ వెంకటరెడ్డిలు ఘనంగా సన్మానించారు.

బాధ్యతలు స్వీకరణ

రఘునాథపాలెం: రఘునాథపాలెం సీఐగా టి.శ్రీహరి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ సీఐగా పనిచేసిన శ్రీధర్‌ను హైదరాబాద్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో శ్రీహరి వచ్చారు. ఖమ్మం అర్బన్ (ఖానాపురంహవేలి) సీఐగా శ్రీహరి విధులు నిర్వర్తిస్తుండగా.. గత నాలుగు రోజులు క్రితం హైదరాబాద్‌కు బదిలీ అయ్యాక తిరిగి రఘునాథపాలెం సీఐగా బదిలీ కాబడ్డారు.

అన్నదానానికి వితరణ

కామేపల్లి: తాళ్లగూడెం గ్రామంలోని శ్రీ లక్ష్మీతిరుపతమ్మ, గోపయ్యస్వామి దేవాలయంలో తిరుపతమ్మ మాలధారులకు గ్రామానికి చెందిన పుచ్చకాయల కృష్ణయాదవ్ కుమార్తె నవ్య పుట్టినరోజు (గురువారం) సందర్భంగా అన్నదానానికి రూ.9 వేలు వితరణగా బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల చిన్న వెంకటేశ్వర్లు, వీరనారాయణ, శ్రీను, కోటయ్య, వెంకటకృష్ణ, రామారావు, మాలధారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కామేపల్లి: నెమలిపురి గ్రామానికి చెందిన విజయకుమారి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భూక్యా బలరాంనాయక్, ధరావత్ సురేష్‌నాయక్ ఆధ్వర్యాన రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

ప్రజాయుద్ధ నౌక గద్దర్



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజా యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్ హౌజ్ వద్ద నిర్వహించిన గద్దర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న అరపల్లి విద్యాసాగర్‌రావు, గుంతేటి వీరభద్రం, గోపగాని శంకర్‌రావు, కాకి భాస్కర్‌లు మాట్లాడుతూ.. గద్దర్ పాట తెలుగు నేలపై విశేషమైందని అన్నారు. జిల్లాకు గద్దర్‌కు విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవిరెడ్డి విజయ్, చిర్ర రవి, లింగాల రవికుమార్, బెజ్జంకి ప్రభాకర్‌చారి, పమ్మిరవి, పాగి వెంకన్న, వెంకట్, గుమ్మడి కనక రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రియదర్శిని' విద్యార్థినుల ప్రతిభ

ఖమ్మంరూరల్: చెన్నైకు చెందిన కోఆప్స్ కంపెనీ బుధవారం వర్చువల్‌గా చేపట్టిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పెదతండాలోని ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ నవీన్ తెలిపారు. మొత్తం 106 మంది విద్యార్థినులు పాల్గొనగా 15మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ కె.నవీన్, అకడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఖమ్మం సహకారనగర్: నల్గొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుకు ఈ నెల 6వ తేదీ వరకు పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర మహిళా కార్యదర్శి విజయలక్ష్మి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సతీశ్, ప్రమీల విజ్ఞప్తి చేశారు. ఫారం–18తో పాటు డిగ్రీ సర్టిఫికెట్, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లకు పాస్ ఫొటోలు అంటించి గెజిటెడ్ అధికారి సంతకంతో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

డీసీసీబీ ఏజీఎం బదిలీ



ఏజీఎంకు జ్ఞాపిక అందజేస్తున్న చైర్మన్, సీఈఓ, తదితరులు

ఖమ్మంవ్యవసాయం: డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అనుమోలు కల్యాణి వరంగల్ డీసీసీబీకి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గురువారం డీసీసీబీ కార్యాలయంలో చైర్మన్ కూరాకుల నాగభూషణం, సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ ఆమెను సన్మానించారు. ఈకార్యక్రమంలో జనరల్ మేనేజర్ నర్మద, డీజీఎం పద్మావతి, డీఆర్‌ఓఎస్‌డీ వెంకటేశ్వర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల కమిటీ ఎన్నిక

కామేపల్లి: బహుజన సమాజ్ పార్టీ ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాదావత్ ప్రతాప్ ఆధ్వర్యాన నియోజకవర్గ అధ్యక్షుడు అజ్మీర వెంకన్న అధ్యక్షతన కామేపల్లి మండల నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా ధరావత్ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా పవన్, ప్రధాన కార్యదర్శిగా మానుకొండ ఆనందరావు, కార్యదర్శిగా తేజావత్ వీరన్న, కోశాధికారిగా చిప్పలపల్లి నిఖిల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం

గ్రామాభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం సర్పంచ్‌ల పదవీకాలం ఈ నెల 31తో ముగియనున్న నేపథ్యాన అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు సర్పంచ్‌లను శాలువాలు, పూల మాలలతో సన్మానించారు. అనంతరం సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పార్టీలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేశామని, ఇంత కాలం తమకు సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, నేటి నుంచి ప్రత్యేకాధికారుల పాలన వస్తుందని, వారికి అందరూ సహకరించాలని మండల అధికారులు కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



కామేపల్లి: కొత్తలింగాలలో సర్పంచ్‌లను సన్మానిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ మల్లిబాబుయాదవ్



తిరుమలాయపాలెం: ఎంపీడీఓ కార్యాలయంలో బచ్చోడు సర్పంచ్ హరితారెడ్డిని సన్మానిస్తున్న ఎంపీపీ మంగీలాల్, ఎంపీడీఓ శ్రీనివాసరావు



ఖమ్మంరూరల్: సర్పంచ్‌లను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు



కామేపల్లి: సర్పంచ్‌లను సత్కరించిన ఎంపీపీ బానోత్ సునీత, అధికారులు

క్యాలెండర్లు ఆవిష్కరణ

రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్లు..



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల సంఘం క్యాలెండర్లను బుధవారం సీపీ సునీల్‌దత్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు రాధాకృష్ణమూర్తి, రుద్రవెంకటనారాయణ, కోశాధికారి సోమయ్య, ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు, సంజీవరావు, సుధాకర్, రంగారావు, ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్‌ఐ జిల్లా క్యాలెండర్లు..

రఘునాథపాలెం: సమరయోధుల పోటలలో ముద్రించిన డీవైఎఫ్‌ఐ ఖమ్మం జిల్లా 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను తహసీల్దార్ విల్సన్‌బెన్నీ బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతల రమేశ్, మండల నాయకులు జోనెబోయిన నవీన్, షేక్.అబ్దుల్, కుదురుపాక సాయి, పావురాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్లకు శంకుస్థాపన



రఘునాథపాలెంలో శంకుస్థాపనలో పాల్గొన్న ఎంపీపీ, కార్పొరేటర్, సర్పంచ్‌లు

రఘునాథపాలెం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో గ్రామీణ లింక్ రోడ్లు అభివృద్ధి కోసం మండలంలో ఆరు బీటీ రోడ్లకు మంజూరైన రూ.12.40 కోట్ల పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ భూక్యా గౌరి, కార్పొరేటర్ మలీదు జగన్ తదితరులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండలంలోని కోటపాడు నుంచిపాపటపల్లి, రఘునాథపాలెం–జింకలతండా, రఘునాథపాలెం–రఘునాథపాలెం బైపాస్‌రోడ్డు, గణేశ్వరం నుంచి దొనబండ, కేవీబంజర–మూలగూడెం, ఎన్‌వీబంజర–మూలగూడెం, మంచుకొండ గ్రామాలకు వేసే రోడ్లకు సర్పంచులు శంకుస్థాపన చేశారు. ఈర్లపూడి సర్పంచ్ దేవ్‌సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ తమ్మినేని నాగేశ్వరావు, ఖమ్మం అసెంబ్లీ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బానోత్ కోటేశ్‌నాయక్, నాయకులు తేజావత్ వెంకన్న, బోయినపల్లి లక్ష్మణ్ గౌడ్, తగరం రవి, పంచాయతీరాజ్ ఏఈ ఆదిత్య పాల్గొన్నారు.

టీసీఎస్‌కు విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌కు చెందిన శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 33 మంది విద్యార్థులు ప్రముఖ టీసీఎస్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ఈడీ డాక్టర్ సాయి గీతిక తెలిపారు. బుధవారం కళాశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. కళాశాలలో మెరుగైన విద్యాబోధన చేయడం , అధ్యాపకుల నిరంతర పర్యవేక్షణతో ఉద్యోగాల్లో మంచి ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, అధ్యాపకులు పాల్గొన్నారు.


పైపులైన్ పనులకు..




శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీ

కామేపల్లి: మండలంలోని ఊట్కూర్ గ్రామంలో ఎమ్మెల్యే గ్రాంట్స్ రూ.20 లక్షలతో మిషన్ భగీరథ పైపులైన్ పనులకు బుధవారం సర్పంచ్ కోడెం సులోచన, ఎంపీటీసీ ఏపూరి హేమమాలినిలు శంకుస్థాపన చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామంలోని సీఈసీ భవనంలోకి జీపీ కార్యాలయాన్ని మార్చగా.. ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రత్యేక చొరవతో పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఉపసర్పంచ్ ఏపూరి లతాదేవి, ఏఈ చిరంజీవి, కాంట్రాక్టర్ యలమద్ది రమేశ్, ఏపూరి మహేందర్‌కుమార్, కార్యదర్శి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



కామేపల్లి: ప్రగతి నివేదికలను చదువుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి



నేలకొండపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జమలారెడ్డి

కామేపల్లి: కామేపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన బుధవారం మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ బానోత్ సునీత మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.మండలంలో ఆటోల ద్వారా బెల్ట్ షాపులకు సరఫరా చేస్తున్న ఒక్కో మద్యం బాటిల్‌పై అదనపు చార్జిలు వసూలు చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ప్రజాప్రతినిధులు నిలదీయగా.. ఈ విషయం తమ దృష్టికి రాలేదని ఎక్సైజ్ అధికారులు వివరణ ఇచ్చారు. ఆర్అండ్‌బీ రోడ్డు దెబ్బతిన్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఈని ప్రశ్నించగా.. సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. అనంతరం అన్ని శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ప్రజాప్రతినిధులు,అధికారులు ఆధ్వర్యాన సర్పంచ్‌లను ఘనంగా సత్కరించారు. ఉత్తమ అధికారులుగా ఇటీవల ప్రశంస పత్రాన్ని అందుకున్న డాక్టర్ చందన, ఏపీఓ శ్రీరాణిని మండల ప్రజాప్రతినిధులు,అధికారులు అభినందించగా.. కార్యక్రమంలో తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో..

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో ఎంపీపీ వజ్జా రమ్య అధ్యక్షతన బుధవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా శాఖల అధికారులు నివేదికలను వినిపించారు. వివిధ పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పలు ప్రశ్నలపై అధికారులను వివరణ అడిగారు. అనంతరం ఎంపీడీఓ జమలారెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి కోసం సర్పంచ్‌లు పెట్టిన ఖర్చులకు సంబంధించి అన్నింటిని సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదనపు బాధ్యతలు ప్రత్యేకాధికారులకు మరింత బాధ్యతను పెంచిందని చెప్పారు. ఈ సమావేశంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, వైస్ ఎంపీపీ నాగయ్య, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.